సాక్షి నిజామాబాద్

గురువారం । 9 । ఫిబ్రవరి । 2023



కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

ఈరోజుల్లో కంప్యూటర్ పరిజ్ఞానం తప్పని సరిగా మారిందని బహుళజాతి సంస్థ ప్రతినిధి రాందాస్ రాయ్ పేర్కొన్నారు.

- 8లో ▸



పరీక్షలకు చదివేదెట్ల..?

జిల్లాలోని పాఠశాలల్లో వార్షిక పరీక్షలు సమీపిస్తున్నా విద్యార్థులకు పూర్తిస్థాయిలో పుస్తకాలు అందలేదు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.9 /19.7

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. సాయంత్రం చలి పెరుగుతుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

భూగర్భ జలాలకు ధోకా లేదు

మోర్తాడ్(బాల్కొండ) : జిల్లాలో భూగర్భ జలాలకు ఎలాంటి ఇబ్బంది లేదని భూగర్భ జలాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేవేందర్ ప్రసాద్ వెల్లడించారు. ఆయన 'సాక్షి'తో బుధవారం మాట్లాడారు. జిల్లాలో సాధారణ నీటిమట్టం 8.91 మీటర్లుగా నమోదైందని తెలిపారు. 2022 అక్టోబర్‌లో 5.37 మీటర్లు, నవంబర్‌లో 6.15 మీటర్లు, డిసెంబర్‌లో 7.52 మీటర్ల లోతులో నీరు నిలిచి ఉందని వెల్లడించారు. ఆశించిన దానికంటే ఎక్కువ వర్షాలు కురవడం వల్ల భూగర్భ జలాలకు ఇబ్బంది ఉండే అవకాశం లేదన్నారు.

జీజీహెచ్‌లో సదరం క్యాంప్



నిజామాబాద్ సిటీ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో బుధవారం సదరం క్యాంప్ జరిగింది. సదరం క్యాంప్‌కు వికలాంగులు వికలాంగత్వం సర్టిఫికెట్ల కోసం అధికసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ అధికారులు ఆస్పత్రి ఆవరణ వెనుక భాగంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. అయితే సదరం క్యాంప్‌నకు ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. కాని ఈ విషయం తెలియని వికలాంగులు నేరుగా జీజీహెచ్ క్యాంప్‌నకు హాజరయ్యారు.

స్పీకర్, మంత్రిని కలిసిన కలెక్టర్



సుభాష్‌నగర్ : స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ భవనంలో వారిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు తీరు, వాటి స్థితిగతులు, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్‌కు వారు శుభాకాంక్షలు తెలియజేశారు.

కల్లు బట్టీలో ఒకరి మృతి

ఖలీల్ వాడి : నగరంలోని నాలుగవటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రనగర్ కాలనీలోని రెండవ కల్లు డిపోలో కోటగల్లీకి చెందిన సాయికుమార్ (35) మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. కల్లుతో పాటు మద్యం సేవించినట్లు తెలిసిందన్నారు. బాధితుడిని ఆస్పత్రికి తరలించడంతో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వార్డుబాయ్‌గా పనిచేస్తున్నట్లు తెలిసింది. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. శవాన్ని పోస్టుమార్టం కోసం జీజీహెచ్ కు తరలించారు.


'పోడు' ప్రక్రియ సత్వరమే పూర్తిచేయాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



సుభాష్‌నగర్ : పోడు భూములకు సంబంధించిన ప్రక్రియను ఈనెల 15 లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన దృష్ట్యా, నిర్దేశిత గడువుకంటే ముందే అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలు వెలువడిన వెంటనే అర్హులైన వారికి ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. కలెక్టర్ అధ్యక్షతన బుధవారం కొత్త కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఆర్‌ఓఎఫ్‌ఆర్ జిల్లాస్థాయి కమిటీ మలివిడత సమావేశం నిర్వహించారు. డివిజనల్ స్థాయి కమిటీలో ఆమోదం పొందినప్పటికీ పలు సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను రెండురోజుల్లో పరిష్కరించాలని, వీటితోపాటు తిరస్కరించిన క్లెయిమ్‌లను మరోమారు క్షుణ్ణంగా పరిశీలించాలి అర్హులకు న్యాయం చేయా లన్నారు. క్లెయిమ్‌లు ఆమోదం, తిరస్కరణకు ఆధారాలను కంప్యూటరీకరించాలన్నారు. అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి నాగురావు, ఆర్డీవోలు రవి, రాజేశ్వర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

పవర్ పాట్లు..



- 24 గంటల కరెంట్ ఉత్తిమాటే
- పంటలు ఎండుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- రోడ్డెక్కి నిరసనలు.. ఆందోళనలు
- మా చేతుల్లో ఏమీ లేదని చేతులెత్తేస్తున్న విద్యుత్ అధికారులు

ఉచిత విద్యుత్ రైతులకు అందని ద్రాక్షలా మారింది. 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతూ ప్రభుత్వం తమను మోసం చేస్తుందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో కరెంటు ఎప్పుడొస్తుందో.. ఎప్పుడో పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

నిజామాబాద్ నాగారం/మోర్తాడ్ : జిల్లాలో వ్యవసాయ విద్యుత్ సర్వీస్ కనెక్షన్లు లక్షా 69 వేలు ఉన్నాయి. జిల్లాలో చెరువు, కాలువల కన్నా ఎక్కువగా బోరుబావుల కిందే పంటలు అధిక మొత్తంలో సాగవుతున్నాయి. ప్రస్తుతం యాసంగి సీజనల్ 3 లక్షల 80 వేల 600 ఎకరాల్లో వరిసాగు చేశారు. వరి పంటకు కచ్చితంగా నీరు అత్యవసరం. బోరుబావుల కింద ఉన్న వరి పంటలకు నీరు కావాలంటే కరెంట్ ఉండాల్సిందే. 15 రోజులుగా సాగుకు విద్యుత్ సరఫరా అరకొరగానే సరఫరా అవుతుంది. ప్రభు త్వం 24 గంటల ఇస్తున్నామన్నా నిబంధన జిల్లాలో అమలు కావడం లేదు. అధికారులు 12 గంటల పాటు సరఫరా చేస్తున్నామని కూడా చెప్పలేని పరిస్థితి నెలకొంది. ప్రతినిత్యం పగటి సమయంలో 4 గంటలు, రాత్రి 6 గంటల పాటు ఇస్తున్నామని చెప్పినా 8 గంటలు కూడా సరఫరా కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి..

చలికాలం తగ్గుతూ ఎండలు పెరుగుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎండల తీవ్రత ఉంటుంది. ఈ సమయంలో పంటలకు కచ్చితంగా నీళ్లు ఉండాల్సిందే. విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంటలకు నీరు అందకపోవడంతో రైతులు మండిపోతున్నారు. జిల్లాకు ప్రతి రోజు 560 మెగావాట్ల విద్యుత్ అవసరం ఉండగా, 220 మెగావాట్ల విద్యుత్ సరఫరా అవుతుంది. ఫిబవ్రరి నెలలో సరఫరాలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ఇక మార్చి నెలలో ఇలాగే ఉంటే పంటలు చేతికి రావంటున్నారు. ప్రస్తుతం నాలుగు రోజుల నుంచి 200 మెగావాట్ల విద్యుత్ సరఫరా అవుతుంది. దీంతో కరెంట్‌పోతే ఎప్పుడొస్తుందోనని సంబంధిత విద్యుత్ అధికారులకు రైతులు ఫోన్లు చేస్తున్నారు. కిందిస్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికారి వరకు కూడా కరెంట్ ఎప్పుడస్తుందో కూడా చెప్పలేకపోతున్నామని చేతులేత్తేస్తున్నారు.

ధర్నాలు.. నిరసనలు..

కరెంట్ కోతల వల్ల జిల్లాలో అక్కడక్కడా రైతులు రోడ్డెక్కి నిరసనలు ప్రారంభించారు. జక్రాన్‌పల్లిలో సబ్‌స్టేషన్‌ను ముట్టడించి నిరసన తెలిపారు. ఎడపల్లి మండలంలో శాటాపూర్‌లో రోడ్డుపై బైటాయించి ధర్నా చేపట్టారు.

పరిష్కారం చూపాలి..



విద్యుత్ కోతలు తీవ్రం కావడంతో ఎటూ పాలుపోవడం లేదు. ఎప్పుడు విద్యుత్ సరఫరా అవుతుందో లేక ఎప్పుడు కోతలు విధిస్తారో తెలియక అయోమయం నెలకొంది. ప్రభుత్వం స్పందించి పరిష్కార మార్గం చూపాల్సిన అవసరం ఉంది.

– కొమ్ముల వెంకటేష్, రైతు, తిమ్మాపూర్

కోతలు లేకుండా చూస్తాం..

విద్యుత్ సరఫరా విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయితే పైనుంచి రావాల్సిన విద్యుత్ సక్రమంగా సరఫరా కావడం లేదు. అందుకే కరెంట్ కోతలు విధిస్తున్నాం. ఉన్నతాధికారులకు జిల్లాలో విద్యుత్ సరఫరా స్థితిగతులను వివరించడం జరిగింది. మా ప్రయత్నం మేం చేస్తున్నాం. అతి త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది.

– రవీందర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ



జక్రాన్‌పల్లి మండలంలోని పడకల్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

రైతుల నిరసన..

జక్రాన్‌పల్లి : వ్యవసాయానికి విద్యుత్ కోతలకు నిరసనగా గురువారం మండలంలోని పడకల్ సబ్‌స్టేషన్‌ను రైతులు ముట్టడించారు. సబ్‌స్టేషన్ ఎదుట నిలబడి నిరసన వ్యక్తం చేశారు. గత నెలరోజులుగా ఇష్టారాజ్యంగా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు పేర్కొన్నారు. అదేవిధంగా రోజుకు ఐదు గంటల కంటే ఎక్కువ విద్యుత్ రాక పంట పొలాలు ఎండిపోతున్నాయని వాపోయారు. రోజుకు 9 గంటల నాణ్యమైన కరెంటును సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. జక్రాన్‌పల్లి ఏఎస్సై వెంకట్, విద్యుత్ అధికారులు వచ్చి రైతులతో మాట్లాడడంతో రైతులు ఆందోళనను విరమించారు. రైతులు బోండ్ల శ్రీధర్, నిమ్మల నందురెడ్డి, పురుషోత్తం, గంగారెడ్డి, పుప్పాల నాగేష్ పాల్గొన్నారు.

ఖలీల్‌వాడిలో వసూల్ రాజా

■ నగరంలోని నడిబొడ్డున ఉన్న ఖలీల్‌వాడి డివిజన్ ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఇక్కడ చిరు వ్యాపారి రమేశ్ (పేరు మార్చాము) నిబంధనల ప్రకారం నగరపాలక సంస్థకు వాణిజ్య పన్ను కడుతూ వ్యాపారం చేసుకుంటున్నాడు. అయినప్పటికీ ఆ ఏరియాలోని అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి భర్తకు ప్రతినెలా ముడుపులు చెల్లించుకోవాల్సిందే. లేకపోతే ఇది మా ఏరియా.. అంటూ బెదిరింపులు తప్పవు. ఇలా రమేశ్ లాంటి వ్యాపారులు ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారు.

- వ్యాపారుల నుంచి ప్రతినెలా వసూళ్లు
- రూ.10 వేల నుంచి రూ. 50 వేలకు పైగా..
- అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి భర్త నిర్వాకం



నిజామాబాద్‌నాగారం : నిజామాబాద్ నగరంలోని 44వ డివిజన్ (ఖలీల్‌వాడి) లో ప్రైవేట్ ఆస్పత్రులు, మెడికల్ షాపులు, ల్యాబ్‌లు, లాడ్జీలు ఎక్కువగా ఉండటంతో అందుకనుగుణంగా వ్యాపార వాణిజ్య సంస్థలు పెద్దమొత్తంలోనే వెలిశాయి. అయితే గతంలో హాయిగా వ్యాపారాలు చేసుకున్న వ్యాపారులు ఇప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం నడుస్తున్న వ్యాపార సంస్థలైనా సరే అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి భర్తకు పన్ను చెల్లించాల్సిందేనని వాపోతున్నారు. లేకుంటే చుక్కలు చూపిస్తారంటున్నారు. ప్రతి నెలా దుకాణం బట్టి రూ. 2000 నుంచి రూ.8000 పైగా వసూళ్లు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రైవేట్ ఆస్పత్రులు 300 పైగా, వ్యాపార వాణిజ్య సంస్థలు 830 వరకు, చిన్న, చితక సంస్థలు 400 వరకు ఉన్నాయి. షాపు స్థాయిని బట్టి అక్రమ వసూళ్లు జరుగుతున్నాయని తెలుస్తోంది.

■ **ట్రేడ్ లైసెన్స్ ముసుగులోనూ..**

ప్రతినెలా ముడుపుల వసూళ్లతో పాటు ట్రేడ్ లైసెన్స్ ముసుగులోనూ ప్రతి ఏడాది ఖలీల్‌వాడి ప్రాంతంలో ఓ ప్రజాప్రతినిధి భర్త వసూళ్లు ప్రత్యేకంగా ఉంటాయి. ఈ డివిజన్‌లో ఇండ్లు 1337 ఉండగా, జనాభా 6199 ఉంది. ప్రతి ఏడాది నగర పాలక సంస్థకు ఇక్కడి నుంచి రూ. 2 కోట్ల 20 లక్షల వరకు వాణిజ్య పన్ను వసూలవుతుంది. కాగా కొన్నాళ్ల క్రితం అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి భర్త తనకు అనుకులంగా ఉన్న ఓ ఉద్యోగిని తన ఏరియాకు తెచ్చుకున్నాడు. ఇంకేముంది తన మనషులు, ఆ ఉద్యోగి కలిసి అక్రమ వసూళ్లకు తెరలేపారు. ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ ఫీజును కచ్చితమైన కొలతలు వేసి ఆన్‌లైన్ ద్వారానే చెల్లించాలి. ఆదాయం నగరపాలక సంస్థకు వెళ్తుంది. అయితే ఇక్కడ అలా కాకుండా ఓ ప్రజా ప్రతినిధి భర్త తరపున వసూళ్లు అవుతున్నాయి. ఆన్‌లైన్‌లో చెల్లిస్తే రూ. లక్షల్లో ఫీజు కట్టాల్సి ఉంటుందని వ్యాపారులను భయపెట్టి రూ. 10 వేల నుంచి రూ. 50 వేలకు పైగా తీసుకుంటున్నాడు. వ్యాపారులకు ఎలాంటి రశీదులు ఇవ్వడం లేదు. అటు నగరపాలకు సంస్థకు చెల్లించడంలేదు. ఇలా నగరపాలక సంస్థ ఆదాయం సదరు ప్రజాప్రతినిధి భర్త జేబులోకి వెళ్లగా.. నగర పాలక సంస్థకు భారీ ఆదాయం గండి పడుతోంది. కాగా ప్రజాప్రతినిధి భర్త ప్రత్యేకంగా తన ఏరియాకు తెప్పించుకున్న ఉద్యోగిని అక్కడి నుంచి అధికారులు ఇటీవల తొలగించినట్లు తెలిసింది. కాగా ఇన్‌చార్జి కమిషనర్ ప్రత్యేక దృష్టి సారిస్తేనే తమకు ఇబ్బందుల నుంచి సంస్థలకు ఉపశమనం లభిస్తుందని స్థానిక వ్యాపారులు పేర్కొంటున్నారు.

వర్నిలో క్లినిక్ సీజ్

వర్ని : వర్ని మండల కేంద్రంలోని స్వీటి క్లినిక్‌ను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు బుధవారం సీజ్ చేశారు. క్లినిక్‌కు వచ్చిన రోగికి హైడోస్ మందులు ఇవ్వడంతో కిడ్నీలకు చెడుప్రభావం చూపిందని ఆరోగ్యశాఖ అధికారికి బాధితుడు ఫిర్యాదు చేయడంతో బుధవారం సాయంత్రం ఆరోగ్యశాఖ అధికారుల సదరు క్లినిక్‌పై దాడిచేశారు. రికార్డులను, మందులను, ఇంజక్షన్లను పరిశీలించి ఆస్పత్రిని సీజ్ చేశారు. ఆస్పత్రిలో హైడోస్ మందులు, ఇంజక్షన్లను గుర్తించినట్లు అధికా రుల బృందం తెలిపింది. పీఎంపీలు హైడో స్ మందులు ఇవ్వడం వల్ల రోగులు ఇతర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు అధికారులు వెల్లడించారు. దాడులు నిర్వహించి ఆస్పత్రిని సీజ్ చేసిన వారిలో ఆరోగ్యశాఖ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజేష్, అధికారులు గంగాధర్, దేవేందర్ ఉన్నారు.



స్వీటి క్లినిక్‌ను సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

బదిలీ వెనుక రాజకీయం..

- రెండేళ్లు కాకుండానే ఏసీపీ వెంకటేశ్వర్‌కు స్థానచలనం
- చక్రం తిప్పిన ఇద్దరు ప్రజాప్రతినిధులు..?
- పోలీసు వర్గాల్లో విపరీతమైన చర్చ



బదిలీ అయిన ఏసీపీ వెంకటేశ్వర్

ఖలీల్‌వాడి : నిజామాబాద్ ఏసీపీ వెంకటేశ్వర్ ఆకస్మిక బదిలీ రాజకీయ రంగు పులుముకుంది. రెండేళ్లు పూర్తి కాకుండానే బదిలీ జరగడం నగరంలో హాట్‌టాపిక్ మారింది. ఏసీపీ నిజామాబాద్‌లో ఏడాదిన్నరకు పైగా పని చేశారు. ఏసీపీగా వచ్చిన వెంకటేశ్వర్ సమర్థుడైన అధికారిగా గుర్తింపు పొందుతూనే ప్రజలతో సంత్సంబంధాలు కొనసాగించారు. నిజామాబాద్ డివిజన్ నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఉంటుంది. అయితే అధికారులు తప్పనిసరిగా ఇక్కడి ప్రజాప్రతినిధుల కన్నుసన్న ల్లో పనిచేయాల్సి ఉంటుంది. జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉండటంతో పాటు మరో ప్రజాప్రతినిధి కలిసి ఏసీపీ బదిలీకి రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. కొన్నాళ్లుగా ఎడమోహం పెడమోహంగా ఉన్న సదరు ఇద్దరు ప్రజాప్రతినిధులు చివరకు ఒక్కటయ్యారు. తమ మధ్య విబేధాలను పక్కన పెట్టారు. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరు అన్నట్లుగా వారిద్దరు ఒక్కటై చివరికి ఏసీపీ బదిలీకి చక్రం తిప్పినట్లు సమాచారం.

రెండు నెలలుగా అంతర్గత చర్చ..

ఏసీపీని బదిలీ చేయాలని రెండు నెలల నుంచి ప్రజాప్రతినిధులు భావించినట్లు తెలిసింది. తమకు వ్యతిరేకంగా ఉన్న వారికి ఏసీపీ పనులు చేస్తున్నారని కొందరు ప్రజాప్రతినిధులు భావించి ఆయనను బదిలీ చేయించాలని ఓ ప్రజాప్రతినిధికి లేఖలు రాసినట్లు సమాచారం.

ఈ లేఖలను ఆధారంగా చేసుకుని ఓ పోలీస్ అధికారి అభిప్రాయం మేరకు ఏసీపీ బదిలీ జరిగినట్లు తెలిసింది. రెండు నెలలుగా ఈ వ్యవహారాన్ని గుట్టుచప్పుడు కాకుండా కొనసాగించినట్లు సమాచారం. మంగళవారం రాత్రి తెలంగాణవ్యాప్తంగా 16 మంది ఏసీపీలు, డీఎస్పీల బదిలీలో ఏసీపీ పేరుండడం నగర పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ బదిలీని ఆపాలని సదరు ఏసీపీ ఎవరి వద్దకు వెళ్లలేదని తెలిసింది. రేపు, ఎల్లుండి హైదరాబాద్‌లోని డీజీపీ ఆఫీస్‌కు వెళ్లనున్నట్లు సమాచారం.

ఎన్నికల కోసమేనా..?

ఎక్కువగా లాంగ్‌స్టాండింగ్ ఉన్న అధికారులను బదిలీ చేస్తుంటారు. వచ్చే ఎన్నికల్లో తమకు అనుకూలంగా ఉండాలనే ఇద్దరు ప్రజాప్రతినిధులు చక్రం తిప్పుతున్నట్లు తెలిసింది. ఎన్నికలకు మరో పదినెలల కాలం ఉన్నప్పటికీ తమకు అనుకూలంగా ఉండే వారిపై ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తున్నట్లు తెలిసింది. అందులో భాగంగానే ఏసీపీ బదిలీ జరిగినట్లు పోలీసు వర్గాలు చర్చించుకుంటున్నాయి.

పెళ్లి పత్రిక నుంచి తులసి మొక్క

- పర్యావరణ హిత ఆలోచనతో ప్రత్యేకంగా తయారు చేయించిన నిజామాబాద్‌కు చెందిన కుటుంబం
- అహ్మదాబాద్‌లో ప్రింటింగ్
- నాలుగు రోజుల్లో పత్రిక మట్టిలో కలిసిపోవడంతో పాటు తలసి మొక్క మొలకెత్తుతుందంటున్న జ్ఞానేందర్ గుప్తా



పర్యావరణహిత పెళ్లి పత్రికతో జ్ఞానేందర్ గుప్తా, శ్రీలక్ష్మి దంపతులు



తులసి విత్తనాలతో కూడిన పెళ్లి పత్రిక

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : సేవా కార్యక్రమాలతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం తమవంతుగా పాటుపడుతున్న నిజామాబాద్‌కు చెందిన ఓ కుటుంబం తమ ఇంట్లో వివాహం నేపథ్యంలో పెళ్లి పత్రికను వినూత్నంగా తయారు చేయించారు. పర్యావరణ హితంగా ఉండేలా ముద్రించిన ఈ పెళ్లి పత్రిక నాలుగు రోజుల్లో మట్టిలో కలిసిపోవడంతో పాటు అందులో నుంచి తులసి మొక్కలు మొలిచేలా చేశారు. నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన మంచాల జ్ఞానేందర్ గుప్తా, శ్రీలక్ష్మి దంపతులు తమ ప్రథమ కుమార్తె డాక్టర్ శరణ్య వివాహం సందర్భంగా ఆమె కోరిక మేరకు తులసి మొక్క విత్తనాలు ఉండేవిధంగా ఆహ్వాన పత్రికను గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో 3 నెలల ముందుగా ఆర్డర్ ఇచ్చి 2,500 కార్డులు ప్రింట్ చేయించారు. ఈ నెల 24 న వివాహం జరుగనుంది. మట్టి పాత్రలో ఈ పత్రికను ఉంచితే అందులో నుంచి తులసి మొక్క ఉద్భవిస్తుందని జ్ఞానేందర్ చెబుతున్నారు. ఈ కార్డును కొందరు అడిగి మరీ తీసుకుంటున్నట్లు చెప్పాడు. పర్యావరణ హితంతో పాటు పూజనీయమైన దైవస్వరూపమైన తులసి మొక్కతో అందరికీ శుభప్రదంగా ఉంటుందంటున్నారు. ఇక వివాహ వేడుకను సైతం పూర్తి శాకాహారంతో, ప్లాస్టిక్ రహితంగా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్డులు పంచిన తరువాత సోషల్ మీడియాలో వైరల్ అవుతుండడంతో విశాఖ, విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి పలువురు ఫోన్లు చేసి అడుగుతున్నట్లు జ్ఞానేందర్ గుప్తా చెబుతున్నారు.

■ **గత 12 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు..**

జ్ఞానేందర్ గుప్తా తన తండ్రి మంచాల శంకరయ్య గుప్తా ఛారిటబుల్ ట్రస్ట్‌ను 12 ఏళ్ల కిందట స్థాపించి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. పేద కుటుంబాలకు చెందిన వారు మరణించినప్పుడు అంతిమయాత్ర కోసం తన స్వగ్రామమైన సొంతూరు సిరిసిల్ల జిల్లా కనగర్తితో పాటు గత పదేళ్లుగా నిజామాబాద్, బోధన్, బాన్సువాడ, హైదరాబాద్, సికింద్రాబాద్, సిరిసిల్ల, వేములవాడలలో ఉచితంగా స్వర్గయాత్ర రథాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా నిజామాబాద్‌లో మృతదేహాలను పెట్టేందుకు గత 8 ఏళ్ల నుంచి 10 ఫ్రీజర్‌లు ఉచితంగా అందుబాటులో ఉంచారు. 8 ఏళ్లుగా నిజామాబాద్‌లోని వినాయక్‌నగర్‌లో ఎండాకాలంలో నీటిని ట్యాంకర్ ద్వారా అందిస్తున్నారు. జ్ఞానేందర్ గుప్తా ఆరేళ్ల నుంచి 4వేలకు పైగా భగవద్గీత గ్రంథాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఎండాకాలంలో పిచ్చుకలు, పక్షులకు నీటికోసం గాను తన చిన్న కుమార్తె హరిణి ఆలోచన మేరకు రెండేళ్లుగా 2 వేలకు పైగా 'బర్డ్ ఫీడర్ బాక్సులు' ఉచితంగా పలువురికి అందించారు.

ఊరిస్తున్న ఎర్రజొన్నల ధర...

- క్వింటాలుకు రూ.4,200చెల్లించేందుకు ముందుకొస్తున్న వ్యాపారులు
- సాగు విస్తీర్ణం తగ్గడంతో ధర ఇంకా పెరుగుతుందని రైతుల్లో ఆశాభావం
- గత సంవత్సరం క్వింటాలుకు రూ.3,500 పలికిన రేటు

మోర్తాడ్ (బాల్కొండ): ఎర్రజొన్నల ధర రైతులను ఊరిస్తోంది. గత సీజను కంటే తక్కువ విస్తీర్ణంలో ఎర్రజొన్నలను సాగు చేయడంతో మార్కెట్‌లో జొన్న గింజలకు కొరత ఏర్పడే అవకాశం ఉంది. ఎర్రజొన్నలు కోత దశకు చేరుకోవడంతో వ్యాపారులు గ్రామాలలోకి వచ్చి రైతులతో సంప్రదింపులు జరుపుతున్నారు. క్వింటాలు ఎర్రజొన్నలకు రూ.4,200 నుంచి రూ.4,300 వరకు ధర చెల్లిస్తామని వ్యాపారులు చెబుతున్నారు. మరింత ధర పెరుగుతుందనే భావనతో రైతులు ధర ఒప్పందానికి వెనుకడుగు వేస్తున్నారు. గత సీజనులో సాగు చేసి విక్రయించకుండా కోల్డ్ స్టోరేజీలలో నిలువ ఉంచిన ఎర్రజొన్నలను ఇటీవల కొందరు రైతులు విక్రయించారు. పాత జొన్నలకు రూ.3,900 వరకు ధర లభించడంతో కొత్తగా చేతికి అందే పంటకు మరింత ధర పెరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు. జిల్లాలో ఈసారి గడ్డి విత్తనం కోసం జొన్నలను సుమారు 30 వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ఎర్రజొన్నలను సాగు చేయడానికి ముందు ధర ఒప్పందం విషయంలో రైతులకు, వ్యాపారులకు మధ్య అంగీకారం కుదరలేదు. ఫలితంగా అనేక మంది రైతులు జొన్నలకు బదులు మొక్కజొన్న సాగుపై దృష్టి సారించారు. గతంలో కంటే గడ్డి జొన్నల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. ఉన్న కొద్ది పంటను తామే కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో సీడ్ వ్యాపారులు గ్రామాలలోకి వచ్చిన పంట కొనుగోలు కోసం ధర ఒప్పందాలకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. గత సీజను కంటే ఈసారి క్వింటాలుకు రూ.600 నుంచి రూ.700 వరకు ఎక్కువ ధర పలుకనుండటంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎర్రజొన్నల కొరత ఉండే అవకాశం ఉన్నందున క్వింటాలుకు రూ.5వేల వరకు ధర పలికే అవకాశం ఉండవచ్చని రైతులు చెబుతున్నారు. ఏది ఏమైనా ఎర్రజొన్నల సాగు విస్తీర్ణం తగ్గడంతో ఈ రకం పంట సాగు చేసిన రైతుల పంట పండే పరిస్థితి కనిపిస్తుందని చెప్పవచ్చు.



మోర్తాడ్‌లో కోతకు వచ్చిన ఎర్రజొన్నలు

క్లుప్తంగా

ఫిజిక్స్‌ హెచ్‌వోడీగా హరిత



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌ క్యాంపస్‌ (భిక్కనూర్‌) భౌతిక శాస్త్రం (ఫిజిక్స్‌) విభాగాధిపతి(హెచ్‌వోడీ)గా అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ హరిత నియామకమయ్యారు. అలాగే ఫిజిక్స్‌ విభాగం బోర్డ్‌ ఆఫ్‌ స్టడీస్‌ చైర్మన్‌గా అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ లలిత నియామకమయ్యారు. ఈ మేరకు బుధవారం వీసీ డి రవీందర్‌, రిజిస్ట్రార్‌ విద్యావర్ధిని నియామక ఉత్తర్వులు అందజేశారు.

తెయూ టార్గెట్‌బాల్‌ మహిళా జట్టు ఎంపిక



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ టార్గెట్‌బాల్‌ (ఉమెన్‌) జట్టు ఎంపిక పోటీలు బుధవారం క్యాంపస్‌ గ్రౌండ్‌లో నిర్వహించారు. తెయూ పరిధిలోని వివిధ అనుబంధ కళాశాలల నుంచి 35 మంది క్రీడాకారిణులు తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో చక్కని ప్రతిభ చూపిన క్రీడాకారులను తెయూ జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన జట్టు ఈ నెల 24 నుంచి చెన్నైలోని సవిత యూనివర్సిటీలో జరుగనున్న సౌత్‌ జోన్‌ ఇంటర్‌ యూనివర్సిటి టార్గెట్‌బాల్‌ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని వర్సిటీ స్పోర్ట్స్‌ అండ్‌ గేమ్స్‌ డైరెక్టర్‌ టి సంపత్‌ తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో తెయూ ఫిజికల్‌ డైరెక్టర్‌ బీఆర్‌నేత, ఫిజికల్‌ డైరెక్టర్‌లు బాలమణి, హైమవతి, స్వప్న, కృతి, వలంటీర్లు రమేష్‌, రాహుల్‌, మోహన్‌, గ్రౌండ్‌ మెన్లు రోహిణి, వసంతరావు పాల్గొన్నారు.

ఐదుగురు యువకుల బైండోవర్‌



మోపాల్‌: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఐదుగురు యువకులను తహసీల్దార్‌ లత ఎదుట బైండోవర్‌ చేసినట్లు ఎస్‌ఐ మహేష్‌ బుధవారం తెలిపారు. ఆకతాయిలుగా తిరుగుతున్న యువకుల నుంచి సత్ప్రవర్తన కోరుతూ బైండోవర్‌ చేశామన్నారు. ఆరు నెలల్లో తమ పద్ధతి మార్చుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని యువకులను హెచ్చరించారు. డీటీ మునీరుద్దీన్‌, తదితరులు ఉన్నారు.

ఇష్టపడి చదవాలి



సదాశివనగర్‌: పదో తరగతి విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని ట్రెయినీ కలెక్టర్‌ శివేంద్రప్రతాప్‌ అన్నారు. బుధవారం సదాశివనగర్‌ ఆదర్శ పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడారు. బాలికల వసతిగృహాన్ని సందర్శించి మెనూ వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో యోసెఫ్‌, ప్రిన్సిపాల్‌ భానుమతి ఉన్నారు.

పరీక్షలకు చదివేదెట్ల?

- పాఠ్యపుస్తకాల పంపిణీలో నిర్లక్ష్యం
- విద్యార్థుల సంఖ్యకు సరిపడినన్ని పంపిణీ చేయని వైనం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



మోర్తాడ్‌లో పంపిణీ చేయాల్సిన పుస్తకాలను పరిశీలిస్తున్న నాయకులు(ఫైల్‌)

మోర్తాడ్‌: పాఠశాలల్లో వివిధ తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మరి కొద్ది రోజుల్లో వార్షిక పరీక్షలను నిర్వహించడానికి విద్యాశాఖ కసరత్తు చేనస్తోంది. వార్షిక పరీక్షలకు గడువు సమీపిస్తున్నా పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం అడుగు అడుగునా కనిపిస్తుంది. 2022–23 విద్యా సంవత్సరానికి ఇంగ్లీష్‌ మీడియంతో పాటు తెలుగు మీడియం పాఠాలు ఉండేలా పుస్తకాలను ముద్రించారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడేంత పుస్తకాలను ప్రచురించకపోవడంతో అందరికి అందలేదు. ఆరు, ఏడు, ఎనిమిది తరగతులు చదువుకుంటున్న విద్యార్థులకు పార్ట్‌ టూకు సంబంధించిన పుస్తకాలను ఇప్పటి వరకు పంపిణీ చేయలేదు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 1.40లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారికి అవసరమైన పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయడానికి విద్యాశాఖ ప్రభుత్వానికి ఇండెంట్‌ పంపించింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్య పుస్తకాలు సరఫరా కాకపోవడంతో కొద్ది మందికి అన్ని రకాల పుస్తకాలు అందగా మరి కొందరికి కొన్ని పాఠ్య పుస్తకాలే పంపిణీ చేశారు. చదువులో ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు అన్ని పుస్తకాలను పంపిణీ చేయగా వెనుకబడి ఉన్న విద్యార్థులకు కొన్నింటిని మాత్రమే అందించారు. ఇద్దరు, ముగ్గురు విద్యార్థులను గ్రూపుగా చేసి వారందరికి ఒక పుస్తకం చొప్పున పంపిణీ చేశారు. ఆ విద్యార్థులు పాఠ్య పుస్తకాలను వంతువారీగా చదువుకుంటున్నారు. పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయకపోవడంపై విద్యాశాఖ ఉన్నతాధికారులను ఎవరైనా ప్రశ్నించినా వారి నుంచి స్పష్టమైన సమాధానం రావడం లేదు. పాఠ్య పుస్తకాల కొరత విషయం బయటకు చెబితే ప్రభుత్వ పరువు పోతుందనే ఉద్దేశంతో అన్ని పుస్తకాలు వంద శాతం పంపిణీ చేశామని విద్యాశాఖ తప్పుడు ప్రచారం చేస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు పంపిణీ జరుగకపోవడంతో విద్యార్థులు హోంవర్క్‌ చేయడానికి అవస్థలు పడుతున్నారు. ముద్రణ సందర్భంలోనే నిర్లక్ష్యం చోటుచేసుకోగా ఆ అలసత్వం విద్యార్థులను వెంటాడుతూనే ఉంది. ఇప్పుడు జరిగిన తప్పును వచ్చే విద్యా సంవత్సరంలో పునరావృతం జరుగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

విద్యా వ్యవస్థపై నిర్లక్ష్యానికి నిదర్శనం



తెలంగాణ ప్రభుత్వం విద్యా వ్యవస్థపై నిర్లక్ష్యం చూపుతుందని చెప్పడానికి పాఠ్య పుస్తకాల పంపిణీ పూర్తి కాకపోవడమే నిదర్శనం. విద్యా సంవత్సరం ఆరంభంలో అందించాల్సిన పుస్తకాలు పరీక్షలు దగ్గరపడుతున్న సమయానికి కూడా పంపిణీ చేయకపోవడం విచారకరం.

– నల్ల నవీన్‌, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

కంప్యూటర్‌ పరిజ్ఞానం తప్పనిసరి



మాట్లాడుతున్న జేపీ మోర్గాన్‌ ఛేజ్‌ అండ్‌ కంపెనీ వైస్‌ప్రెసిడెంట్‌ రాందాస్‌రాయ్‌ మంతెన

తెయూ(డిచ్‌పల్లి): ఆధునిక యుగంలో అన్ని విభాగాలకు చెందిన విద్యార్థులు, ఉద్యోగులు తమ సబ్జెక్టులతో పాటు కంప్యూటర్‌ పరిజ్ఞానము తప్పనిసరిగా నేర్చుకోవాల్సిన అవసరం ఉందని అమెరికన్‌ ఆర్థిక సేవల బహుళజాతి సంస్థ జేపీ మోర్గాన్‌ ఛేజ్‌ అండ్‌ కంపెనీ వైస్‌ ప్రెసిడెంట్‌ రాందాస్‌రాయ్‌ మంతెన అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ కంప్యూటర్‌ సైన్స్‌ కాలేజీ సెమినార్‌ హాల్‌లో బుధవారం 'ఫేస్‌ గ్లోబల్‌ కాంపిటీషన్‌ హయ్యర్‌ ఎడ్యుకేషన్‌ అండ్‌ జాబ్‌ అపర్చునిటీస్‌ అబ్రాడ్‌ అండ్‌ టెక్నాలజీ ట్రెండ్స్‌' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడారు. తెయూ వీసీ డి రవీందర్‌ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి భిక్కనూరులోని సౌత్‌క్యాంపస్‌లో ఎంఎస్సీ డాటా సైన్స్‌ అండ్‌ డాటా అనాలసిస్‌ కోర్సును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వచ్చే 6 నెలల్లో 10 మంది యూనివర్సిటీ విద్యార్థులని అమెరికాలో చదవడానికి తీసుకెళ్తానని అన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌ విద్యావర్ధిని, విదేశీ వ్యవహారాల కార్యాలయం డైరెక్టర్‌ ప్రవీణ్‌ మామిడాల, ప్రిన్సిపాల్‌ సీహెచ్‌ ఆరతి పాల్గొన్నారు.

నలుగురికి పీహెచ్‌డీ



జైపాల్‌నాయక్‌



సంపత్‌కుమార్‌



వంగాల సుధాకర్‌



బి అనూష

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలోని అర్థశాస్త్రం, మాస్‌కమ్యూనికేషన్‌, బయోటెక్నాలజీ విభాగాల్లో నలుగురు పరిశోధక విద్యార్థులు జైపాల్‌నాయక్‌, అన్నబోయిన సంపత్‌కుమార్‌, వంగాల సుధాకర్‌, బి.అనూషకు బుధవారం పీహెచ్‌డీ డాక్టరేట్‌ ప్రదానం చేశారు. తెయూ అర్థశాస్త్ర విభాగం అసోసియేట్‌ ప్రొఫెసర్‌ కే రవీందర్‌ రెడ్డి పర్యవేక్షణలో 'ఏ స్టడీ టు ఎవల్యూట్‌ ది పర్ఫార్మెన్స్‌ ఆశ వర్కర్స్‌ ఇన్‌ ది ఇంప్రూమెంట్‌ ఆఫ్‌ హెల్త్‌ స్టేటస్‌ ఇన్‌ తెలంగాణ' అనే అంశంపై జైపాల్‌ నాయక్‌ పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. మాస్‌కమ్యూనికేషన్‌ హెచ్‌వోడీ ఘంటా చంద్రశేఖర్‌ పర్యవేక్షణలో 'సామాజిక అవగాహనను పెంపొందించడంలో ప్రజా సంబంధాల పాత్ర –సమాచార, ప్రజా సంబంధాల విభాగం అధ్యయనం– తెలంగాణ ' అనే అంశంపై అన్నబోయిన సంపత్‌కుమార్‌, కె.రాజారాం పర్యవేక్షణలో 'పబ్లిక్‌ రిలేషన్స్‌ ప్రాక్టీసెస్‌ ఇన్‌ సెంట్రల్‌, స్టేట్‌ అండ్‌ ప్రైవేట్‌ యూనివర్సిటీస్‌ ఇన్‌ తెలంగాణ స్టేట్‌' అనే అంశంపై వంగాల సుధాకర్‌ పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాలు సమర్పించారు. బయోటెక్నాలజీ విభాగం బీవోఎస్‌ చైర్మన్‌ ప్రవీణ్‌ మామిడాల పర్యవేక్షణలో 'అంటీనెల్‌ ట్రాన్స్‌క్రిప్టోమ్‌ అండ్‌ డిఫరెన్షియల్‌ ఎక్స్‌ప్రెషన్‌ ఆఫ్‌ ఓడోర్‌ ప్రాసెసింగ్‌ జీన్స్‌ ఆఫ్‌ సిరిపోఫాగా ఇన్‌సెర్టులస్‌ ఏ సీరియస్‌ ఇన్సెక్ట్‌ పేస్ట్‌ ఆఫ్‌ రైస్‌' అనే అంశంపై బి అనూష పరిశోధన చేసి డాక్టరేట్‌ పొందారు.

రిపబ్లిక్‌ డే కేడెట్లకు అపూర్వ స్వాగతం



కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో స్వాగతం పలుకుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

కామారెడ్డి అర్బన్‌: కామారెడ్డి ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు ఆర్‌ చందు, ఎం అరుణ ఢిల్లీలో గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొని బుధవారం కామారెడ్డికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కామారెడ్డి రైల్వే స్టేషన్‌ నుంచి కళాశాల వరకు వారికి కాలేజీ విద్యార్థులు అపూర్వ స్వాగతం పలికారు. టాప్‌ లేని జీపులో నిలబెట్టి ప్రధాన వీధుల మీదుగా వారిని ఊరేగించారు. అనంతరం కళాశాల ఆడిటోరియంలో ఇద్దరిని సన్మానించారు. ప్రిన్సిపాల్‌ కె కిష్టయ్య విద్యార్థులను అభినందించారు. ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్‌ రామస్వామి మాట్లాడుతూ ఇప్పటికి వరకు కాలేజీకి చెందిన 38 మంది కేడెట్లు రిపబ్లిక్‌ డే పరేడ్‌లో పాల్గొన్నారని, ఎంతో మంది భారత త్రివిధ దళాల్లో పనిచేస్తున్నారన్నారు.

జాతీయస్థాయిలో రాణిస్తున్న కొత్తాబాది విద్యార్థినులు



కొత్తాబాదికి చెందిన సుప్రియ, లావణ్య

బాన్సువాడ రూరల్‌: అసోంలోని గౌహతీలో జరుగుతున్న జాతీయ స్థాయి సీనియర్స్‌ వాలీబాల్‌ టోర్నమెంట్‌లో బాన్సువాడ మండలం కొత్తాబాది గ్రామానికి చెందిన విద్యార్థినులు రాణిస్తున్నారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన సుప్రియ, లావణ్య పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నారని వ్యాయామ ఉపాధ్యాయుడు సురేందర్‌ అన్నారు.

అబ్దుల్‌ కలాం విగ్రహం ఏర్పాటు చేయాలి



ప్యాకెట్‌ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్‌

సుభాష్‌నగర్‌: మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌ కలాం పేపర్‌ బాయ్‌గా తన జీవితాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగారని, ఆయన విగ్రహాన్ని జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేయాలని న్యూస్‌ పేపర్స్‌ సెల్లార్స్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు వనమాల సత్యం డిమాండ్‌ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతును కలిసి వినతిపత్రం అందజేశారు. అబ్దుల్‌ కలాం రాష్ట్రపతి వంటి ఉన్నత శిఖరాన్ని అధిరోహించారని, వారు సమాజానికి, దేశానికి ఎనలేని సేవలు చేశారని గుర్తుచేశారు. అలాగే పత్రికలు పంపిణీ చేస్తున్న వారిలో ఎక్కువ మంది ఆర్థికంగా వెనకబడి ఉన్నారని కలెక్టర్‌ దృష్టికి తీసుకొచ్చారు. వీరిని వృత్తి పనివారిగా గుర్తించి సైకిల్‌, ఎలక్ట్రికల్‌ టూ వీలర్స్‌ను అందించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా క్యాలెండర్‌ ఆవిష్కరించారు. దూస రవికుమార్‌, కె శ్రీనివాస్‌, రవీందర్‌ పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

డబ్బు ఇచ్చిన మిత్రుడినే హతమార్చాడు

- తిరిగి ఇవ్వమన్నందుకు ఘాతుకం
- కేసు ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రభాకర్‌

నందిపేట: అవసరం ఉందంటే ఎవరికి తెలియకుండా అప్పు ఇచ్చిన మిత్రుడినే హతమార్చాడో వ్యక్తి.. తీసుకున్న అప్పు కట్టడానికి డబ్బు లేకపోవడంతో స్నేహితుడిని నదిలో తోసివేసి చంపేశాడు. ఏసీపీ ప్రభాకర్‌ బుధవారం వివరాలు వెల్లడించారు. మండలంలోని ఉమ్మెడ గ్రామానికి చెందిన ఏర్గట్ల శ్రీకాంత్‌, నాగం భోజేందర్‌ అలియాస్‌ చింటూ చిన్నప్పటి నుంచి స్నేహితులు. శ్రీకాంత్‌ దుబాయిలో ఉండేవాడు. కాగా భోజేందర్‌ తనకు అవసరం ఉందని పలుమార్లు శ్రీకాంత్‌ వద్ద రూ.రెండు లక్షల వరకు అప్పుగా తీసుకున్నాడు. అయితే శ్రీకాంత్‌ నవంబర్‌లో దుబాయ్‌ నుంచి వచ్చిన తర్వాత తీసుకున్న డబ్బులను ఇవ్వాలని భోజేందర్‌ను అడిగాడు. తీసుకున్న అప్పు తీర్చేందుకు డబ్బులు లేకపోవడంతో డబ్బులు ఎగొట్టేందుకు శ్రీకాంత్‌ను చంపాలని ప్లాన్‌చేశాడు. ప్లాన్‌ ప్రకారం డిసెంబర్‌ 3న సాయంత్రం ఉమ్మెడ బ్రిడ్జి వద్దకు శ్రీకాంత్‌ను రమ్మని చెప్పాడు. శ్రీకాంత్‌ బ్రిడ్జి గోడపై కూర్చున్న తర్వాత ఒక్కసారిగా గోదావరిలోకి తోసేశాడు. తర్వాత శ్రీకాంత్‌ బైక్‌ను అక్కడే వదిలేసి పారిపోయాడు.

మొదట ఆత్మహత్యగా కేసు..

శ్రీకాంత్‌ కనబడడం లేదని మృతుడి అన్న ఏర్గట్ల బాల్‌రాజ్‌ డిసెంబర్‌ 3న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్‌ కేసు నమోదు చేసిన పోలీసులు ఉమ్మెడ బ్రిడ్జిపై శ్రీకాంత్‌ బండి ఉండటంతో గోదావరి నదిలో జాలర్లతో గాలించగా మృతదేహం దొరికింది. ఆత్మహత్య కేసుగా నమోదు చేశారు. శ్రీకాంత్‌ దుబాయి నుంచి వచ్చిన 25 రోజులకే ఈ ఘటన జరగడంతో అనుమానం వచ్చిన పోలీసులు గ్రామంలో విచారణ చేపట్టారు. శ్రీకాంత్‌కు ఆత్మహత్య చేసుకునేంత కారణాలు లేకపోవడంతో ఆర్మూర్‌ రూరల్‌ సీఐ గోవర్ధన్‌రెడ్డి, ఎస్సై కాంత్‌, సిబ్బంది మరింత లోతుగా దర్యాప్తు చేపట్టారు. హత్యకు ముందు రోజు భోజేందర్‌, శ్రీకాంత్‌ ఇద్దరు తిరిగిన సెల్‌ టవర్లు ఒక్కటే కావడం, ఘటన జరిగిన నాటి నుంచి కనబడకుండ పోయిన భోజేందర్‌పై అనుమానం ఉండడంతో ఆ దిశగా దర్యాప్తు చేశారు. ఘటన తర్వాత దుబాయి వెళ్లి ఇటీవల తిరిగి వచ్చిన భోజేందర్‌ను బుధవారం నందిపేట బస్టాండ్‌లో అదుపులోకి తీసుకుని విచారించగా డబ్బులు ఎగొట్టేందుకు హత్యచేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు ఏసీపీ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి జిల్లాలో బుధవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. ఆర్టీసీ బస్సు, బైక్‌ ఢీకొన్న ఘటనలో యువకుడు, బోరుబండి ఢీకొని కార్మికుడు, ఎక్సెల్‌ అదుపు తప్పి మహిళ చనిపోయారు.



రుద్రూర్‌లో రాస్తారోకో చేస్తున్న అన్వర్‌ బంధువులు

రుద్రూర్‌: రుద్రూర్‌ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. బాన్సువాడకు చెందిన సయ్యద్‌ అన్వర్‌(25) బోధన్‌ పట్టణంలోని ఓ బేకరిలో పని చేస్తాడు. బుధవారం బైక్‌పై బోధన్‌ నుంచి బాన్సువాడ వెళ్తుండగా రుద్రూర్‌ శివారులో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, బైక్‌ ఢీకొన్నాయి. ఈ ఘటనలో అన్వర్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రుద్రూర్‌ సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై రవీందర్‌ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహన్ని ఆస్పత్రికి తరలించడానికి ఏర్పాట్లు చేస్తుండగా మృతుడి బంధువులు రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఆర్టీసీ డీఎం ఘటన స్థలానికి రావాలని డిమాండ్‌ చేశారు. దీంతో ట్రాఫిక్‌ జామ్‌ కావడంతో బస్సులను రాయకూర్‌ మీదుగా మళ్లించారు. ఆర్టీసీ అధికారులు, పోలీసులు సముదాయించడంతో ఆందోళన విరమించారు.

బోర్‌వెల్స్‌ బండి ఢీకొని ఒకరు..



సముర్‌సింగ్‌ మృతదేహం

మాక్లూర్‌: మండలంలోని బొంకన్‌పల్లిలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సముర్‌ సింగ్‌(25) అనే యువకుడు బుధవారం బోర్‌వెల్స్‌ బండి ఢీకొని మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ తెలిపారు. వివరాలు.. బొంకన్‌పల్లి గ్రామానికి చెందిన కె సుధాకర్‌ ఇంటి వద్ద బోరుబావి తవ్విస్తుండగా అదే బోరు బండి మీద పని చేసే యువకుడు డ్రైవర్‌కు రివర్స్‌ సైడ్‌ చూపిస్తుండగా ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ సముర్‌సింగ్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. బోరు బండి మునీమ్‌ రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

ఎక్సెల్‌ అదుపు తప్పి మహిళ..

తాడ్వాయి: మండలంలోని బ్రహ్మజీవాడి స్టేజీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మండలంలోని కన్‌కల్‌ గ్రామానికి చెందిన కమ్మరి బాలచంద్రం, అతని భార్య కమ్మరి సువర్ణ(43) కామారెడ్డిలో పనులు ముగించుకొని టీవీఎస్‌ ఎక్సెల్‌పై కన్‌కల్‌కు వెళ్తున్నారు. బ్రహ్మజీవాడి స్టేజివద్ద ఎక్సెల్‌ వెనుక టైర్‌ పంక్చర్‌ అయింది. దీంతో వాహనం అదుపు తప్పడంతో భార్యాభర్తలు కిందపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సువర్ణ మృతి చెందింది.

మద్యానికి బానిసై ఆత్మహత్య



సాయిరాం (ఫైల్‌)

ఎల్లారెడ్డి: ఎలుకల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్లారెడ్డిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై గణేష్‌ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గూడెం కాలనీలో నివాసముండే కొట్టాల సాయిరాం (40) మద్యానికి బానిసయ్యా డు. తాగేందుకు భార్యను డబ్బులు ఇవ్వాలని తరచు వేధించేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కల్లులో ఎలుకల మందు కలుపుకుని తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్‌ తెలిపారు.

కుటుంబ కలహాలతో ఒకరు..

నిజాంసాగర్‌: బిచ్కుంద మండలం పుల్కల్‌ గ్రామానికి చెందిన పబ్బతి సాయిలు(38) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సాయిలుకు పెళ్లయి 15 ఏళ్లైనా పిల్లలు కలగలేదు. ఈ విషయంలో భార్య శోభ అతనితో తరచూ గొడవ పడుతుండేది. బుధవారం పుల్కల్‌ గ్రామంలో శోభ గొడవ పడగానే సాయిలు ఇంటి వెనకాల గల బావిలో దూకి చనిపోయాడు. సాయిలు తల్లి సత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

వర్ని: మండలంలోని జలాల్పూర్‌ గ్రామంలో విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. బుధవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో షేక్‌ యాకూబ్‌ ఇల్లు కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఒక టీవీఎస్‌ ఎక్సెల్‌, కూలర్‌, ఫ్రిడ్జ్‌, ఇతర సామగ్రి కాలిపోయాయి. సుమారు రూ. నాలుగు లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

నదిలో దూకేందుకు యత్నం

- వృద్ధుడిని కాపాడిన యంచ యువకుడు

నవీపేట: మండలంలోని యంచ శివారులోని గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడేందుకు యత్నించిన వృద్ధుడిని యంచ గ్రామానికి చెందిన యువకుడు కాపాడాడు. బుధవారం జరిగిన ఈ సంఘటన వివరాలు.. ఆర్మూర్‌ మండలం అంక్సాపూర్‌ గ్రామానికి హైదర్‌(63) బుధవారం ఉదయం యంచ శివారులోని గోదావరి నది బ్రిడ్జి దగ్గర అనుమానాస్పదంగా కనిపించాడు. యంచ నుంచి బాసర వైపు బైక్‌పై వెళ్తున్న వినోద్‌ హైదర్‌ను గమనించి బైక్‌ ఆపాడు. బ్రిడ్జి అంచుపై ఎక్కి నదిలోకి దూకేందుకు యత్నించగా వినోద్‌ అడ్డుకుని గ్రామపెద్దలకు అప్పగించారు. బాధితుడి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారమివ్వగా ఆయన కుమారుడు వచ్చి తీసుకెళ్లాడు. వృద్ధుడి ప్రాణాలు కాపాడిన వినోద్‌ను పలువురు అభినందించారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం

నిజామాబాద్‌ సిటీ: నిజామాబాద్‌ రూరల్‌ మండలం ఖానాపూర్‌కు చెందిన లావణ్య తన కూతురుతో పాటు అదృశ్యమైనట్లు బుధవారం రూరల్‌ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఖానాపూర్‌కు చెందిన లావణ్య మూడేళ్ల వయస్సు గల కూతురు కృతికను తీసుకుని ఈ నెల 1న దుస్తులు కొనుగోలు చేయడానికని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లింది. రాత్రి అయిన ఇంటికి చేరుకోక పోవటంతో కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త శ్రీకాంత్‌ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని పూలాంగ్‌ ప్రాంతంలోని ఆకృతి బట్టల దుకాణం పక్కన గుర్తు తెలియని వ్యక్తి (70) మృతి చెందినట్లు నాలుగో టౌన్‌ ఎస్సై తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు స్థానికుల సమాచారం మేరకు వెళ్లి పరిశీలించామని చెప్పారు. మృతుడి ఆచూకీ లభించకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు



గాయపడ్డ రాజు

ఎడపల్లి: మండలంలోని జానకంపేట సమీపంలో గల దర్గా వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని ఎంఎస్‌సి ఫారం గ్రామానికి చెందిన అన్నారం రాజు అనే యువకుడు బుధవారం సారంగాపూర్‌లో ఉన్న పెట్రోల్‌ బంకు వద్ద ఒక కార్‌ డ్రైవర్‌ తో గొడవపడ్డాడు. అనంతరం బైక్‌పై వెళ్తూ సదరు కారును ఓవర్‌ టేక్‌ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టాడు. దీంతో రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా ఆస్పత్రికి తరలించారు. నిజామాబాద్‌ ఆరో టౌన్‌ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటో బోల్తా పడి డ్రైవర్‌కు..



క్షతగాత్రుడు సత్యగౌడ్‌

పిట్లం: పిట్లం ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో మంగళవారం రాత్రి ఆటో బోల్తా పడి డ్రైవర్‌ సత్యగౌడ్‌కు గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. సంగారెడ్డి జిల్లా కల్హేర్‌ మండలానికి చెందిన సత్యగౌడ్‌ ఆటోలో పిట్లం నుంచి తన గ్రామానికి వెళ్తుండగా ఆటో బోల్తా పడింది. సత్యగౌడ్‌కు గాయాలు కావడంతో అతనిని స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికు తరలించారు.

కారు బోల్తా పడి ఒకరికి..



జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్‌ శివారులో బుధవారం కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కేశ్‌పల్లి యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. మండలంలోని కేశ్‌పల్లి గ్రామానికి చెందిన యువకుడు కారులో ఆర్మూర్‌కు వెళ్తున్నాడు. పడకల్‌ శివారులో ఆటోను ఓవర్‌టేక్‌ చేయబోయి అదుపు తప్పడంతో కారు బండ రాళ్లపై ఎక్కి బోల్తాపడింది. ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ కోరగా ప్రమాదం విషయం తమ దృష్టికి రాలేదని తెలిపారు.